



'శాతవాహన'లో అన్నీ ఖాళీలే..

- రెగ్యులర్ వీసీ లేక ఇబ్బందులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- గెస్ట్ లెక్చరర్లతో బోధన
- సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులతో విద్యార్థులపై భారం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

శాతవాహన విశ్వవిద్యాలయం పరిస్థితి పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్టుగా తయారైంది. రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్ లేడు. సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. యూనివర్శిటీ వీసీగా ఉన్న ప్రొఫెసర్ మల్లేశ్ 2024 మే 21న పదవీ విరమణ చేశారు. ఇన్‌చార్జి వీసీగా గనులశాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను నియమించారు. ఒక క్రియాశీలమైన శాఖలో కార్యదర్శిగా ఉన్న ఆయన విశ్వవిద్యాలయానికి వచ్చి సమయం వెచ్చించే పరిస్థితి లేదు. పన్నెండు డిపార్టుమెంట్లు ఉన్న విశ్వవిద్యాలయంలో 114 మంది బోధన సిబ్బంది అవసరం కాగా 63 మంది మాత్రమే ఉన్నారు. వీరిలో 16 మంది మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. ఇద్దరు ప్రొఫెసర్లు, మరో ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఎనిమిది మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెగ్యులర్ ఉద్యోగులుగా ఉన్నారు.



10 ప్రొఫెసర్ పోస్టులు, 16 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు, 21 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్టు, పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీలతో యూనివర్సిటీ నడుస్తోంది. యూనివర్సిటీ కార్యాలయంలో సేవలందించడానికి 51 మంది బోధనేతర సిబ్బంది అవసరముండగా తొమ్మిది మందితో మాత్రమే ఉన్నారు. ప్రతి డిపార్టుమెంట్‌కు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాల్సి ఉంటుంది. ఏ ఒక్కశాఖలోనూ పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ పైనే ఆధారపడుతున్నారు. దీనితో ఈ యూనివర్సిటీ రెగ్యులర్ వీసీ, రెగ్యులర్ బోధకులు లేక గెస్ట్ యూనివర్సిటీగా మారింది. ఏళ్ల గడుస్తున్నా ఈ ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

విద్యార్థుల డిమాండ్లను పట్టించుకోని అధికారులు

యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, ఫుడ్ సైన్స్ విభాగాలను రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని కొద్ది సంవత్సరాలుగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. దానిని పట్టించుకోని అధికారులు రెగ్యులర్ కోర్సులుగా నడుస్తున్న తెలుగు, ఇంగ్లీష్, బాటనీ, మ్యాథమెటిక్స్ విభాగాలను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చారు. అదేమంటే యూజీసీ 12బీ గుర్తింపు ఇవ్వడంతో వీటిని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చామని అంటున్నారు. రెగ్యులర్ కోర్సులను సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులుగా మార్చడంతో అధ్యాపకుల జీతాలు చెల్లించే బాధ్యత ప్రభుత్వంపై నుంచి విద్యార్థు లపైన పడింది. విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సులను అనుసరించి ఫీజులు వసూలు చేసి వాటితో ఆ కోర్సులను బోధించే అధ్యాపకుల వేతనాలను చెల్లిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల విడుదల సక్రమంగా విడుదల కాకపోవడంతో పరిశోధన ప్రాజె క్టులు రాకుండా పోతున్నాయని, ఫెలో షిప్స్ కూడా లేకుండా పోతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త కోర్సుల జాడేలేదు

ప్రభుత్వం యూనివర్సిటీని పట్టించుకోకపోవడంతో కొత్త రెగ్యులర్ కోర్సులు మంజూరు కాకపోవడంతో పోస్టులు మంజూరు కావడం లేదు. 2008లో యూనివర్సిటీ ప్రారంభమైనా 16 ఏళ్లు గడిచినా ఎటువంటి అభివృద్ధి జరగడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ యూనివర్శిటీ అభివృద్ధి బాటలో నడుస్తుందని ఆశించిన విద్యార్థుల కలలు కల్లలుగా మారాయి. గడిచిన పదేళ్లలో ఒక్క కొత్త కోర్సు కూడా ప్రారంభించక పోవడం విద్యార్థులను నిరాశకు గురిచేస్తున్నది. ఈ యూనివర్సిటీని ప్రారంభించిన సమయంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి 200 ఎకరాల భూమితోపాటు రెగ్యులర్ కోర్సుల ప్రాతిపదికన పోస్టులను మంజూరు చేసింది. వైస్ ఛాన్స్‌లర్లుగా ఉన్న ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ వీరారెడ్డి కొత్త కోర్సులకు ప్రతిపాదనలు చేశారు. ఆ తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా ఆ ప్రతిపాదనలన్నీ అలాగే మిగిలిపోయాయి. ఉమ్మడి జిల్లా పరిధి నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న పొన్నం ప్రభాకర్, డి శ్రీధర్‌బాబు, శాతవాహన యూనివర్సిటీపై దృష్టిసారించాలని విద్యార్థులు కోరు తున్నారు. రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్‌ను నియమించి కొత్త రెగ్యులర్ కోర్సులను ప్రారంభించడంతోపాటు పాత పోస్టులన్నింటిని రెగ్యులర్ ఉద్యోగులతో భర్తీ చేసి కొత్త పోస్టులను మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

రేపు జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 12: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జూనియ ర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 14న నిర్వహించనున్నారు. జిల్లాలోని అంబేద్కర్ స్టేడియంలో బాల బాలికలకు అం డర్-14, 16, 18, 20 వయస్సు విభాగాలల్లో పోటీలను నిర్వహించనున్నామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యర్శులు నందెల్లి మహిపాల్, కదారి రవి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 8 గంటల కు స్టేడి యంలో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈనెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణుల నిరసన

- దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు



తెలంగాణచౌక్‌లో నినాదాలు చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 12: కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అమెరికాలో దేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశాడంటూ బీజేపీ శ్రేణులు నిరసన తెలిపాయి. గురువారం కరీంనగర్ తెలంగాణచౌక్‌లో బీజేపీ జిలా శాఖ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టి, దిష్టిబొమ్మను దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అమెరికాలో రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు వింటుంటే అయన భారతీ యుడేనా అన్న అనుమానం కలుగుతోందన్నారు. విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రతీసారి భారత్‌ను చులకన చేస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశభక్తిపై విదేశీ మీడియాలో కథనాలు వస్తున్నాయన్నారు. ఈ దేశంలో స్వేచ్ఛ లేకపోతే తెలంగాణ, కర్ణాటక, ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎలా గెలిచిందన్నారు. అలాగే స్వార్థ రాజకీయాల కోసం రాహుల్‌గాంధీ మత, రిజర్వేషన్ల రద్దు అంశంతో ప్రజల ను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రజలంతా రాహుల్ గాంధీ నైజాన్ని ,కుట్రలను గమనించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కళ్లెం వాసుదేవరెడ్డి, సీనియర్ నాయకులు వాసాల రమేష్, కార్పొరేటర్లు కోలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, గుజ్జేటి శివ, ఎడమ సత్యనారాయణరెడ్డి, జానపట్ల స్వామి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్ దండు కొమురయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర, బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, నాయకులు వారల దేవేందర్, పెంట శ్రీనివాస్, వాసు, రాజు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీ యింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యలను పరి ష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, జిల్లా కమిటి సభ్యులు రాకేశ్, సందేశ్, సుధీర్, అక్షయ్, సాత్విక్, హరీష్, కరణ్‌సింగ్, అంజి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గంగోని కుంట స్థలాన్ని పరిశీలించిన తహసీల్దార్

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



హుజూరాబాద్‌లో గంగోని కుంట మ్యాప్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కనకయ్య

హుజూరాబాద్, సెప్టెంబరు 12: పట్టణంలోని గంగోని కుంటను తహసీల్దార్ కనకయ్య, ఆర్ఐ చంద్రశేఖర్ గురువారం పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'కబ్జాకు గురవుతున్న గంగోని కుంట' అనే శీర్షిక గురువారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ కనకయ్య గంగోని కుంటను పరిశీలించారు. కుంట స్థలంలో మొరం పోసిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు నాలుగు రోజుల్లో సర్వే నిర్వహించి గంగోని కుంట హద్దులు నిర్ణయిస్తామన్నారు. ఎవరైనా కుంటను అక్రమిస్తే కలెక్టర్ ఆదేశాల మేరకు కూల్చివేస్తామన్నారు.

హుజూరాబాద్‌లో భారీ బందోబస్తు

ఆందోళనలకు అనుమతి ఇవ్వని పోలీసులు



హుజూరాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

హుజూరాబాద్, సెప్టెంబరు 12: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై పాడి కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. హుజూరాబాద్ నియోజకవర్గంలో హై టెన్షన్ ఏర్పడింది. సీపీ అభిషేక్ మొహంతి ఆదేశాల మేరకు హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, శ్రీలత, ఎస్ఐలు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి ఆందోళనలకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు రోడ్లపైకి రాకుం డా ఇళ్లకే పరిమితం చేశారు.. హుజూరాబాద్‌లో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు అంబేద్కర్ చౌరస్తా వద్దకు వచ్చేందుకు ప్రయ త్నించగా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్దనే వారిని పోలీసులు అడ్డుకున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసుకోవాలని తెలిపారు. దీంతో వారు ప్రెస్‌మీట్ పెట్టి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ ప్రజలు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురయ్యారు.

వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన వర్షాల వల్ల వరదలు వచ్చి తీవ్ర నష్టం జరిగిందని, ఈ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో వర్షాలు కురిసి తీవ్రమైన పంటల నష్టం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు నిండి కొన్ని చోట్ల చెరువులు కుంటలకు గండ్లు పడ్డాయన్నారు. ఇళ్లల్లోకి నీరు చేరి తీవ్ర నష్టం జరిగిందన్నారు. నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర అధికారుల బృందం పర్యటించి, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రానికి ఆరు వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చిందని, హామీలన్ని నెరవేర్చాలని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని, వాటిని తొలగించాలన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న పాల్గొన్నారు.



ఎల్ఎండీలో నిండుగా నీరు

నిలకడగా ఎల్ఎండీలో నీటి నిల్వ

తిమ్మాపూర్, సెప్టెంబరు 12: కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలో నీటి మట్టం నిలకడగా కొనసాగుతుంది. ఎల్ఎండీలోకి 1,304 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 309 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. ఎల్ఎండీ పూర్తి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా గురువారం సాయంత్రం వరకు 23.861 టీఎంసీ ల నీరు నిల్వ ఉంది. ఎల్ఎండీ పూర్తి స్థాయి వరకు నిండడంతో ఎల్ఎండీ ప్రధాన గేట్ల పై నుంచి బయటకు నీరు వస్తోంది.

విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 12: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలను విద్యార్థులు తిప్పికొట్టాలని ఏఐసీటీయూ జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాల సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం విద్యా రంగ సమస్యల పరిష్కారానికి సమర శీల పోరాటాలు నిర్వహించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంతో విద్య రోజురోజుకు పేదలకు అందని ద్రాక్షలాగా మారిందన్నారు. పేద వాడికి మరింత దూరం చేసే దిశగా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల యూపీఎస్సీ, నీట్, నెట్ వంటి ప్రాధాన్యం ఉన్న పరీక్షల పేపర్లు లీక్ అవ్వడం సిగ్గు చేటన్నారు. ఈ పేపర్ లీకులకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్రమోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తుందన్నారు.



హాజరైన నాయకులు, విద్యార్థులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఏఐసీటీయూ జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాదం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. లేకపోతే ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు వక్తలు హాజరై మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు, ఏఐకే ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, కేంద్ర నాయకులు ఉదయ్‌కుమార్, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూరి, నగేష్, తిరు పతి, రాష్ట్ర సహా య కార్యదర్శి రాజేష్ నాయక్, తిరుపతి, వంగూరు వెంకటేశ్వర్లు, నీలిమ, అనురాధ, వీరబాబు, రంగ స్వామి, పరుశురాం, వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు రాహుల్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని రైతు మృతి

- మరొకరికి గాయాలు



చిన్నలింబన్న(ఫైల్)

మల్లాపూర్, సెప్టెంబరు 12: మండలంలోని మొగిలిపేట గ్రామ శివారు లో లారీ ఢీకొట్టడంతో రాణవేని చిన్నలింబన(60) అను రైతు గురువారం మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందని రాణవేని చిన్నలింబ న్నతో పాటు గ్రామానికి చెందిన మల్యాల గంగులు మొగిలిపేట గ్రామ శివారులోని ఉన్న మొక్కజొన్న తోటకు వెళ్లారు. చేనులో పనులు ముగించుకుని చిన్నలింబన్న ద్విచక్ర వాహనంపై ఇద్దరు ఓబులాపూర్‌కు బయల్దేరారు. ఖానాపూర్ నుంచి మెట్‌పల్లికి వెళ్తున్న లారీని డ్రైవర్ సయ్యద్ ముస్తాక్ అజాగ్రత్తగా మొగిలిపేట శివారులో చిన్నలింబన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చిన్నలింబన్న తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన గంగును చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించారు. మృతుడి భార్య రాజగంగు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

వీణవంక, సెప్టెంబరు 12: మండలంలోని రామక్ర ష్ణాపూర్ గ్రామానికి చెందిన బొబ్బల మోహన్‌రెడ్డి (82) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరా ల ప్రకారం.. మోహన్‌రెడ్డి భార్య ప్రమీల తొమ్మిది నెలల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహ త్య చేసుకున్నాడు. మృతుడి కూమారుడు బొబ్బల అశోక్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

రూ.7,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట, సెప్టెంబరు 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు తొమ్మిది మంది రైతులు 117క్వింటాళ్ల విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,800 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఖరారయ్యేనా..?

● నేడు మూడో సారి తలనీలాల టెండర్లు

● దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాట్లు

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో తలానీలా పోగు చేసుకునేందుకు గాను అధికారులు మరో సారి తలానీ లాల టెండర్లు శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు గాను హైదరాబా ద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహిం చగా తగిన వేలం రాకపోవడంతో వేలం వాయిదా వేసిన అధికారులు మూడో సారి శుక్రవారం నిర్వహించను న్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1,116 హెచ్చు పాట రాగ ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నారు.

కాగా కొండగట్టులో నిర్వహించిన తలానీలాల టెండర్లు ప్రతీ సారీ కొలిక్కి రాకపోవడంతో అధికారులు కమిషనర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. కాగా మూడో సారి అయిన ఖరారు అయ్యోనా అని ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం నిర్వహించే టెండరులో పాల్గొనడానికి 10 షెడ్యూల్స్ వచ్చినట్లు తెలిసింది

నరసింహుడి సన్నిధిలో సినీ నటుడు రాజీవ్ కనకాల



రాజీవ్ కనకాలకు స్వామి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఈవో

ధర్మపురి, ఆగస్టు 12: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని సి నీ నటుడు రాజీవ్ కనకాల గురువారం ఉదయం సందర్శించారు. వేద పం డితులు, అర్చకులు, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆ యన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపం డితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, చిత్రపటం బహూకరించి సత్కరిం చారు. అనుబంధ ఆలయాలను కూడ సందర్శించారు. ఆయన వెంట ఆల య సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, నంబి నరసింహమూర్తి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● అంజన్నను దర్శించుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే

మల్యాల, సెప్టెంబరు 12: కొండగట్టు ఆంజనేయస్వామిని గురువారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్వర్లు దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్య వేక్షకులు హరిహర నాథ్ శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు ఉన్నారు.

● సినీనటుడి పూజలు

సినీ నటుడు రాజీవ్ కనకాల ఆంజనేయ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. స్వామి వారి విశిష్టతను ఆలయ అర్చకులు వివరించారు. పర్యవేక్షకులు హరిహరనాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ ఆయన వెంట ఉన్నారు. రాజీవ్ కనకాలతో పలువురు సెల్ఫీలు దిగారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నిరసన

గణేశ్‌నగర్, సెప్టెంబరు12: రాష్ట్ర విద్యుత్తు ఎస్సీ మరియు ఎస్టీ ఉద్యోగుల ఐకాస పిలుపు మేరకు జిల్లా విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీజీఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనందం, డివిజనల్ ఇంజనీర్ వరంగల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఆనంద్, బండారి చంద్రయ్య మరియు ప్రాంతీయ కార్యదర్శి శ్రీ వీ కిరణ్ కుమార్ కరీంనగర్, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం శ్రీ సుల్తాన్ రవి, ఏఏవో రాందాస్, గణేష్ జేఏవో కరీంనగర్ టౌన్ మరియు రూరల్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆరేపల్లి శామయ్య, మల్లేపల్లి అంజయ్య , జాడి తిరుపతి, రత్నం పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్

భగత్‌నగర్, సెప్టెంబరు 12: కొత్తపల్లి మండలంలోని చింతకుంట, కొత్తపల్లి పట్టణంలో నిర్వహించే నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్‌లు అన్నారు. గురువారం చింతకుంటలోని ఎస్సారెస్పీ కాలువ, కొత్తపల్లి చెరువులను పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిమజ్జనానికి ఆటంకం లేకుండా చెరువులో తుంగను తీయించాలన్నారు. చుట్టు పక్కల ప్రజలకు ఇబ్బందులకు లేకుండా బారికేడ్లను ఏర్పాటు చేయడానికి భూమిని చదువును చేయాలన్నారు. చెరువు పరిసరాల్లో డస్ట్ చల్లించడం, లైటింగ్ ఏర్పాట్లు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ రాజేశ్, మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ రమేష్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ గంగాధర్, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం, ఆర్అండ్‌బీ, కార్పొరేషన్, రెవెన్యూ, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయినగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్‌ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ ఛైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ ఛైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా పీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. పీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.


4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్యలోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

విభిన్న రూపా.. విఘ్నేశ్వరా..


కరీంనగర్‌లో విఘ్నేశ్వర నవరాత్రోత్స వాలు ఘనంగా జరుగుతున్నాయి. అందమైన సెట్టింగులు, విద్యుత్‌దీపాలతో మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు. విభిన్న ఆకృతులలో ఉన్న వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ రకాల వినాయకులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్







రాంనగర్ వద్ద మిత్ర యూత్ ఆధ్వర్యంలో 30 అడుగుల మట్టి గణపతి, కోతిరాంపూర్, టవర్‌సర్కిల్‌లో కొలువు దీరిన గణనాథుడు, కరీంనగర్ పాత బజార్‌లో ఒకటవ నంబర్ గణపతి, కార్ఖానగడ్డ గాంధీ విగ్రహం వద్ద పూజలందుకుంటున్న బాల గణేషుడు, ప్రకాశం గంజ్‌లో వినాయకుడు

నేడు ఆసుపత్రుల్లో ఓపీ సేవలు బంద్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: పెద్దపల్లి జిల్లాలో డాక్టర్‌పై రోగి బంధువులు దాడి చేయడాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఓపీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు డాక్టర్ రామ్‌చరణ్, కార్యదర్శి డాక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేస్తున్నామన్నారు. అత్యవసర వైద్యసేవలు మినహా మిగతా అన్ని సేవలు నిలిపి వేస్తున్నట్లు వారు చెప్పారు.

ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తా
-అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 12: పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రముఖ విద్యావేత్త, అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను చదువుకున్న ఎస్ఆర్ఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు విచ్చేసి సమావేశం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో నిలుస్తున్న సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు తనకు మద్దతు తెలపాలని కోరారు. తనకు ఒక అవకాశం కలిపిస్తే ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవన మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా మీడియా కన్వీనర్‌గా మహేందర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 12: ఆర్యవైశ్య మహాసభ జిల్లా మీడియా కన్వీనర్‌గా చిట్టిమల్ల మహేందర్‌ను నియమించారు. గురువారం వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైశ్య సేవా కేంద్రం మాజీ అధ్యక్షుడు పెద్ది రామన్న, ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి వడకంటి శ్రీనివాస్, సేవాదళ్ అధ్యక్షుడు ఎలగందుల మునీందర్, రాజకీయ కమిటీ కన్వీనర్ రామిడి శ్రీధర్, వివాహ పరిచయ వేదిక జిల్లా కన్వీనర్ రాచమల్ల భద్రయ్య, యువజన అధ్యక్షుడు జిడిగె సాయికృష్ణ, మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

గణేశ్‌నగర్, సెప్టెంబరు12: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కే.రాధ మాట్లాడుతూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రావడానికి గల కారణాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వరలక్ష్మి పాల్గొన్నారు.

రాజకీయ నాయకులతో ఆర్డీవో సమావేశం

హుజూరాబాద్, సెప్టెంబరు 12: హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో గురువారం వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కొత్త ఓటర్ల నమోదు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారి దొంగ ఓటర్ల వివరాలను ఎలా గుర్తించాలో ఆర్డీవో రమేష్‌బాబు వివరించారు. సమావేశంలో తహసీల్దార్ కనకయ్య, వివిధ పార్టీల రాజకీయ నాయకులు సొల్లు బాబు, రాజేష్, ప్రశాంత్, తూర్పాటి రాజు పాల్గొన్నారు.

ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి

ఇల్లందకుంట, సెప్టెంబరు 12: దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులకు సంబంధించి కోట్లాది రూపాయలు ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేసి గతంలో మాదిరిగా వెంటనే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను సత్వరం మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రవీంద్రచారి అన్నారు. గురువారం మండలంలోని కనగర్తి, బూజూనూర్, సిరిసేడు, టేకుర్తి, మల్యాల, రాచపల్లి, ఇల్లందకుంట, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సాన కిషన్, శ్యామ్‌కుమార్, రజాక్‌పాషా, పురుషోత్తంమూర్తి, రవినాయక్, రవి, రామ లక్ష్మి, కౌసల్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

హుజూరాబాద్, సెప్టెంబరు 12: హుజూరాబాద్ పట్టణంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కమిషనర్ సమ్మయ్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా కాకతీయ కెనాల్ వద్ద నిర్వహించే నిమజ్జన ఏర్పాట్లకు అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, ఇరిగేషన్ డీఈఈ రాము, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందులా, మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఏఈ సాంబరాజు, కిషన్‌రావు, జవాన్లు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని నిరసన

వీణవంక, సెప్టెంబర్ 12: దళితబంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని వీణవంకలో లబ్ధిదారులు నిరసన తెలిపారు. నియోజకవర్గంలో దాదాపు 18 వేల మందికి దళితబంధు మంజూరు కాగా రెండో విడత నిధులు 5 వేల మంది లబ్ధిదారులకు మంజూరు కావాలని అన్నారు. ఫ్రీజింగ్ తీసివేసి లబ్దిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

గన్నేరువరం, సెప్టెంబర్ 12: సైబర్ మోసాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తాండ్ర నరేష్ అన్నారు. మండలంలోని మైలారం గ్రామంలో గురువారం యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి ఫోన్‌కాల్ వస్తే అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

తుమ్మనపల్లి ఎస్సారెస్పీ కెనాల్ వద్ద పసికందు లభ్యం

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబర్ 12: పుట్టి నాలుగురోజులైన పసికందును తుమ్మనపల్లి ఎస్సారెస్పీ కాలువ వద్ద పడేసిన ఘటన గ్రామంలో కలకలం సృష్టించింది. గ్రామానికి చెందిన గుండేటి బక్కారెడ్డి అనే రైతు తన ట్రాక్టర్‌ను శుభ్రం చేసుకోవడానికి తుమ్మనపల్లి గ్రామ శివారులోని కాకతీయ కాలువ ర్యాంపులోకి దిగాడు. ట్రాక్టర్ కడుగుతున్న సమయంలో కాలువ పక్కన ఉన్న గడ్డిలో చిన్న పిల్లాడి ఏడుపు వినిపించింది. వెంటనే గమనించిన ఆయన కట్టపై ఉన్న గడ్డి పొదల వద్దకు వెళ్లి చూడగా సంచిలో మూట కట్టిన శిశువు కనిపించాడు. వెంటనే గ్రామంలోని మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డితో పాటు గ్రామ పెద్దలకు తెలియజేశారు. వారు హుటాహుటిన కాకతీయ కాలువ వద్దకు వచ్చి శిశువును సంచితో సహా బయటికి తీసి చూశారు. అప్పటికీ మగ శిశువు ఏడుస్తున్నాడు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ తిరుమల్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పాపను తన కారులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స చేసిన డాక్టర్లు శిశువు ఆరోగ్యంగానే ఉన్నాడని, దూరం నుంచి విసిరివేయడం వల్ల కొన్ని గాయాలు అయ్యాయని తెలిపారు.

'ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి అరికెపూడి గాంధీ క్షమాపణ చెప్పాలి'

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 12: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంపై దాడి ఘటనపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ కాంగ్రెస్ పార్టీలో చేరడాన్ని కౌశిక్‌రెడ్డి ఎత్తి చూపారని అన్నారు. ఒక ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేపై దాడి చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే గాంధీ క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

'క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

భగత్‌నగర్, సెప్టెంబరు12: పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు.

'దాడి అప్రజాస్వామికం'

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 12: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నివాసంపై ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులు దాడి చేయడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే పక్కా ప్రణాళికతోనే దాడి జరిగిందని మండిపడ్డారు.

పంటల సాగుపై నేడు అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 12: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని రైతు వేదికలో రైతులకు, పురుగుల మందులు విక్రయించే డీలర్లకు సమగ్ర సస్యరక్షణ-యజమాన్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సత్యం తెలిపారు. రైతులకు హైదరాబాద్ సెంట్రల్ ఐపీఎం నుండి శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏడీఏలు సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఓపెన్ జిమ్‌లు ప్రారంభం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 12: కరీంనగర్ మండలం చామనపల్లి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, హైమాస్ లైట్లను గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆరోగ్య ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు ఈ ఓపెన్‌జిమ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు జక్కను కనకయ్య, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు మీసాల సాయిలు, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, ప్రశాంత్, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుంది'



గెలుపొందిన క్రీడాకారులతో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 12: క్రీడలు మానసిక ఉల్లాసం కలుగుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం కరీంనగర్ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు స్థానిక అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గెలిచిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి ఎం.రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 12 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. గురువారం వెలిచాల రాజేందర్‌రావు కరీంనగర్‌లోని తన ఇంటికి టీఎన్జీవోల సంఘం రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు, ప్రతినిధులను బ్రేక్ ఫాస్ట్‌కు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారితో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌తో పాటు టీఎన్జీవో సంఘం నాయకులను వెలిచాల రాజేందర్‌రావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్‌రెడ్డి కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి, టిజిఓ నాయకులు కాళీ చరణ్, మామిడి రమేష్, అర్బన్ అధ్యక్షులు సర్దార్ హర్మేందర్‌సింగ్, రూరల్ అధ్యక్షులు మారుపాక రాజేష్, భరద్వాజ్, తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్ పాల్గొన్నారు,

వేసవిలో సాగు, తాగునీటికి ఇబ్బంది లేదు



ఎల్ఎండీని సందర్శిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 12 : ప్రాజెక్టులు పూర్తి స్థాయి నీటి మట్టం వరకు నిండడంతో వేసవిలో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం లోయర్ మానేరు డ్యాంను సందర్శించి నీళ్లల్లో పూలు వదిలి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, వరద కాలువతోనే మిడ్ మానేరు, లోయర్ మానేరులు నిండాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కొరివి అరుణ్ కుమార్, శ్రవణ్ నాయక్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, పోరండ్ల రమేష్, జీడి రమేష్, దన్న సింగ్, ఖంరొద్దిన్, షబానా మహమ్మద్, ఊరడి లత, జ్యోతి రెడ్డి, మహాలక్ష్మి, రజితా రెడ్డి, మూల జైపాల్, మెరుగు స్వప్న, హస్తపురం తిరుమల, బషీర్, వెంకట్‌రెడ్డి, అజ్మత్, జమాల్, ఇమామ్, మల్లిఖార్జున్, మాసుం ఖాన్, సాయి పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం సంయుక్త కార్యదర్శిగా భాగ్యలక్ష్మి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: మున్నూరుకాపు సంఘం మహిళ సంయుక్త కార్యదర్శిగా బొమ్మ భాగ్యలక్ష్మిని నియమిస్తూ రాష్ట్ర అధ్య క్షుడు కొండ దేవయ్య ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి భాగ్యలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు12: నగరంలోని మెహర్‌నగర్ వివేకానందపురి కాలనీలో మెహర్ నగర్ గణేష్‌ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథునికి గురువారం శాకంబరి పూజ నిర్వహించారు. గణనాథున్ని వివిధ రకాల కూరగాయాలతో అలంకరించి వేద మంత్రోత్స వాలతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉత్సవకమిటీ సభ్యులు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంరవీందర్‌రెడ్డి, రామ్, రాజ్, తిరుపతి, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

●నగరంలోని పలు కాలనీల్లో వెలిసిన గణనాథులను కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు దర్శించుకున్నారు. గాంధిరోడ్డు, ఏడవ డివిజన్, 30, 43వ డివిజన్లలో ప్రతిష్ఠించిన వినాయక మండలాల వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల పద్మప్రకాశ్, నేతికుంట యాదయ్య, సరిల్ల ప్రసాద్, నడిపల్లి అశోక్‌రావు, పిట్టల శ్రీనివాస్, తోట రాజేందర్, గండి శ్యామ్, పెండోట నర్సింహాచారి, ఆకుల సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కిమ్స్ కళాశాలలో ఓనం వేడుకలు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబరు 12: కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఓనం పండుగ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు మాట్లాడుతూ ఓనం పండుగ సౌభ్రాతృత్వానికి సౌభాగ్యానికి ఐక్యతకు చిహ్నం అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనూష్‌రెడ్డి, అధ్యాపకులు గౌతమ్, యశ్వంత్, అజయ్, సతీష్, రాము, మోహన్‌బాబు, శాలిని, చంద్రకళ పాల్గొన్నారు.

మురికికాలువ నిర్మాణం పూర్తి కాక ఇక్కట్లు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 12: నగరంలోని మారుతీనగర్ 30వ డివిజన్‌లో మురికి కాలువ నిర్మాణం అర్ధాంతరంగా వదిలేయటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ 30వ డివిజన్ అధ్యక్షులు దొంతి గోపి నిరసన వ్యక్తం చేశారు. వర్షాలకు రోడ్డుపై నీరు ఎత్తుగా ఉన్న మురికి కాలువలోకి వెళ్ళక రోడ్డుపైననే నిలిచిపోయి, దోమలు బెడద తీవ్రమైందన్నారు. ఈ దుస్థితికి నగర మేయర్ సునీల్‌రావు అసంబద్ధ విధానాలే కారణ మని విమర్శించారు. ఈ సమస్యలపై నగరపాలక సంస్థకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించలేదని ఆరోపించారు. 30వ డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే డివిజన్ ప్రజల పక్షాన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళతానని అన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 12: రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం వాసిరెడ్డిపల్లికి చెందిన ఎలిగేటి నిహాంత్ రక్తహీనతతో బాధపడుతుండడంతో కుటుంబ సభ్యులు జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. అయితే బాలునికి అత్యవసరంగా రక్తం ఎక్కించాలని డాక్టర్లు సూచించడంతో వెంటనే ఆసర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాపోలు గోపికృష్ణను సంప్రదించారు. ఆయన వెంటనే స్పందించి సంస్థ సభ్యుడు జాడి అనిల్‌చే రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా రక్తదానంతో ప్రాణదాతగా నిలిచిన అనిల్ ను సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఆర్. గోపికృష్ణ, సభ్యులు కే. ప్రవీణ్ కుమార్, జి. తిరుపతి, ఏం. రవి చందర్, ఎస్. నిఖిల్ తదితరులు అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

● చొప్పదండి: నేతన్నలకు లబ్ధి చేకూరుస్తున్నందుకు మండల వస్త్ర ఉత్పత్తి సంఘం, కార్మిక సంఘం, చేనేత సహకారం సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

● తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి గ్రామంలో దొబ్బల కుమార్(35) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. గ్రామ మాజీ ఎంపిటిసి బండారి రమేష్ గౌడ్ మిత్రుల సహకారంతో గ్రామస్థులు 48,600 రూపాయల నగదు జమచేసి కుటుంబానికి అందించారు.

● తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం రాష్ట్రీయ బాల స్వస్థ బృదం సందర్శించింది. జాతీయ అంధత్వ నివారణలో భాగంగా ఈ బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

●ఇల్లందకుంట: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామానికి చెందిన సంజీవరావు అనే వ్యక్తి పత్తి చేనును ధ్వంసం చేసి అతనిని దుర్భాషలాడినందుకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండలం కేజీబీవీ పాఠశాలను గురువారం జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు.

● తిమ్మాపూర్:మండలంలోని పెస్టిసైడ్స్ సీడ్స్, ఫర్టిలైజర్ షాపుల్లో గురువారం మండల వ్యవసాయధికారి జే.సురేందర్ తనిఖీలు నిర్వహించారు.

● సైదాపూర్: సైదాపూర్ మండలంలోని వెన్కేపల్లి గ్రామంలో ఆర్ఐ శరత్, ఏఈ ఆంజనేయులు, కార్యదర్శి రాజేశ్వర్‌రావు, కారోబారి గడ్డం రమేష్ పాల్గొన్నారు.

● తిమ్మాపూర్: తిమ్మాపూర్‌లో గురువారం మండల స్థాయి బీజేపి పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలి వేలి సమ్మిరెడ్డి ముఖ్య అతిధిగా హజరైయ్యారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం సందర్శించారు.

● శంకరపట్నం: కేజీబీవీలో కుక్ ఉద్యోగానికి గురువారం ఎంఈవో మధుసూదనాచారి రైతు వేదికలో ఇంటర్వ్యూ నిర్వహించారు.

మహిళలను అవమానిస్తే కౌశిక్‌రెడ్డిని గ్రామాల్లో తిరగనివ్వం



చీరలు, గాజులు చూపిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు

హుజూరాబాద్, సెప్టెంబరు 12: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ నియోజకవర్గానికి వస్తే చీరలు, గాజులు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని, మహిళలను అవమానిస్తే కౌశిక్‌రెడ్డిని గ్రామాల్లో తిరుగనివ్వమని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు అన్నారు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను చీరలు, గాజులు తొడుక్కోవాలని కౌశిక్‌రెడ్డి అనడం సిగ్గుచేటన్నారు. ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉండి తోటి ఎమ్మెల్యేలను చులకనగా మాట్లాడడం తగదన్నారు. భార్య, బిడ్డను అడ్డం పెట్టుకొని ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్‌రెడ్డికి మహిళలపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. గతంలోనే మహిళా కమిషన్ ముందు మోకారిల్లిన కౌశిక్‌రెడ్డికి బుద్ధి రావడం లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకురాళ్లు పుష్పలత, లావణ్య, రేణుక, సుశీల, రాధ, రేణుక, మల్లేశ్వరి, సునీత, స్వరూప, తిరుమల, కరిమా తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో నిరసనలు

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దేశిని స్వప్న-కోటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటం వద్ద నాలుకను ఫినాయిల్‌తో కడిగి వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డికి మహిళలు అంటే గౌరవం లేదని, మహిళ గవర్నర్ అని చూడకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడాడని గుర్తు చేశారు. జమ్మికుంటలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి బ్లాక్ మెయిల్ చేసి గెలువడం కాదు, దమ్ముంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలని సవాల్ విసిరారు. బీజేపి జిల్లా ఉపాధ్యాక్షులు ఎరబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ కౌశిక్‌రెడ్డి నియోజకవర్గం పరువు తీస్తున్నాడని, గెలిచి తొమ్మిది నెలలు అయిన నియోజకవర్గానికి చేసింది ఏం లేదన్నారు. పొనగంటి మల్లయ్య, జిల్లెల తిరుపతిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, బొంగోని వీరన్న, శ్రీపతి నరేష్, పిట్టల శ్వేత-రమేష్, దిడ్డి రాము, రావికంటి రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

సైదాపూర్, సెప్టెంబరు 12: ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల స్థలం త్వరగా ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే విధంగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో సైదాపూర్ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉద్యమకారులు ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి, మండలాధ్యక్షుడు వస్తాదుల సదానందం, శిరంశెట్టి శ్రీనివాస్, గడ్డం స్వామి, శ్రీనివాస్, చంద్రయ్య, శ్రీనివాస్, అంకూస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సరికాదు

హుజూరాబాద్, సెప్టెంబరు 12: హైద్రాబాద్‌లోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే గాంధీ దాడి చేయడం అమానుషమని బీఆర్ఎస్ నాయకుడు బండ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● వీణవంక : హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి పిరికిపంద చర్య అని దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాపర్తి అఖిల్ అన్నారు. పోలీసులు ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి మరో ఎమ్మెల్యే గాంధీకి ఎస్కార్ట్ ఇచ్చి వాహనంలో తన అనుచరులతో వచ్చి ఇంటి పై దాడి చేయడం ముఖ్యమంత్రి కనుసన్నుల్లోనే జరిగిందని మండిపడ్డారు.

జ్వరాల బారిన పడితే పరీక్షలు చేసుకోవాలి

శంకరపట్నం, సెప్టెంబరు 12: మండలంలోని ప్రజలు జ్వరాల బారిన పడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకొని వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స పొందాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గొట్టే శ్రావణ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కరీంపేట గ్రామంలో డెంగ్యూ పాజిటివ్ కేసు నమోదైందని తెలిపారు.

సీతారాం ఏచూరి మృతికి పలువురి సంతాపం

భగత్‌నగర్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఏచూరి మరణం కమ్యునిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్ అన్నారు. ఏచూరి మృతి తీరని లోటు అని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు అన్నారు.

● కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్ : సీతారాం ఏచూరి మృతిపట్ల డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

● కరీంనగర్ టౌన్: సీతారాం ఏచూరి మృతి పట్ల మేయర్ యాదగిరి సునీల్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సీతారాం ఏచూరి మృతి ప్రజాతంత్ర ఉద్యమాలకు తీరనిలోటని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కుమార్, కెఎఫ్ జావిద్ నివాళులర్పించారు.

● జమ్మికుంట: సీతారాం ఏచూరి మృతిపార్టీకి తీరని లోటని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. గురువారం జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, నాయకులు కొప్పుల శంకర్, చెలుపూరి రాములు, జక్కుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక.. శారీరకోల్లాసం

● చిగురుమామిడి: క్రీడాలతో మానసిక, శారీరక ఉల్లాసం కల్గుతుందని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించినారు. మాజీ ఎంపిపి కొత్త వినీత- శ్రీని వాస్‌రెడ్డి, ఎంపిడిఓ ఎండి ఖాజా మొయినోద్దీన్, ఎస్సై రాజేశ్ పాల్గొన్నారు.

● గంగాధర: విద్యార్థులు చదువుతో పాటు క్రీడ లో రాణించాలని ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి అన్నా రు. గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల ను ఆయన ప్రారంభించారు. వాలీబాల్ సీని యర్ జాతీయ క్రీడాకారులు ఠాగూర్, హరీష్, కిరణ్,శశీ, నరేష్‌లను సన్మానించారు.

● రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ క్రీడలు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఎంఈవో అంబటి వేణుకుమార్, హెచ్ ఎం కన్నం రమేష్, మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరి దత్తాత్రేయ శర్మ, పీడీలు విద్యార్థులు ఉన్నారు.

● మానకొండూర్ : మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం అయ్యాయి. రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. ఎస్‌జిఎఫ్ మండల కార్యదర్శి ఆర్. నర్సయ్య, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిఈటీలు శ్రీనివాస్, యూనిస్‌పాషా, శ్యామలాదేవి, వీరన్న, రమేశ్, సుమన్, పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.